ఈనాడు
నిర్మల్
గురువారం అక్టోబరు 17, 2024

ఆర్జీయూకేటీకి మళ్లీ ఇన్‌ఛార్జి వీసీనే

● వెంకటరమణ బదిలీ ● కొత్త ఉపకులపతికి పరీక్షే

ఈటీవీ-ఆదిలాబాద్, న్యూస్‌టుడే, బాసర(ముథోల్): బాసరలోని రాజీవ్‌గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయాని(ఆర్జీయూకేటీ)కి మళ్లీ నిరాశనే ఎదురైంది. శాశ్వత ఉపకులపతి నియామకం కోసం విద్యార్థులు చేస్తున్న పోరాటం ఫలించలేదు. రెండున్నరేళ్లుగా ఇన్‌ఛార్జి ఉపకులపతిగా పనిచేస్తున్న ఆచార్య వెంకటరమణను బుధవారం బదిలీ చేసిన ప్రభుత్వం ఆయన స్థానంలో జేఎన్‌టీయూ హెచ్ కంప్యూటర్ సైన్స్ విభాగం ఆచార్యుడు ఎ.గోవర్ధన్‌కు ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించింది. తొలిసారిగా 2010లో శాశ్వత ఉపకులపతిగా నియమితులైన ఖరగ్‌పూర్ విద్యావేత్త రాజ్‌కుమార్ విధి నిర్వహణ 2015 వరకు కొనసాగింది. ఆతరువాత శాశ్వత ఉపకులపతుల నియామకం ఆగిపోయింది. ఇన్‌ఛార్జిల పాలనతోనే నెట్టుకు రావాల్సి వస్తోంది. మిగిలిన విశ్వవిద్యాలయాల మాదిరిగానే కులపతిగా గవర్నర్‌ను, ఆయన పర్యవేక్షణలో శాశ్వత ఉపకులపతిని నియమించాలనే విద్యార్థులు ఆందోళనలు చేస్తున్నా ఆ డిమాండ్ నెరవేరలేదు.


ఆర్జీయూకేటీ

సఫలం కాని ప్రయత్నాలు

రెండేళ్ల కిందట శాశ్వత ఉపకులపతి నియామకమే ప్రధాన డిమాండ్‌గా విద్యార్థులు చేసిన నిరవధిక ఆందోళన రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేకెత్తించింది. స్పందించిన అప్పటి ప్రభుత్వం విద్యార్థులను శాంతింపచేసేలా తొలుత 2022 జూన్‌లో ఓయూ ఆచార్యుడు సతీష్‌కుమార్ డైరెక్టర్ నియమించింది. విద్యార్థుల ఆందోళన కాస్త సద్దుమణిగాక అదే ఏడాది ఆగస్టులో ఉన్నత విద్యా మండలి ఉపాధ్యక్షుడిగా ఉన్న ఆచార్య వెంకటరమణను ఇన్‌ఛార్జి ఉపకులపతిగా నియమించింది. ఉన్నత విద్యామండలి ఉపాధ్యక్షుడిగా, ఇన్‌ఛార్జి ఉపకులపతిగా బాధ్యతల కారణంగా వెంకటరమణ ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చింది. పాలకుల పట్టింపులేనితనంతో ఆర్జీయూకేటీలో వ్యవస్థీకృతమైన లోపాలను సరిదిద్ది, విద్యాప్రమాణాలు పెంచటానికి ఆయన చేసిన ప్రయత్నాలు సఫలం కాలేదు. పైగా విశ్వవిద్యాలయం ప్రారంభమైన 2008 నుంచి 2023 జూన్ 13 వరకు 15 మంది విద్యార్థులు బలవన్మరణాలకు పాల్పడితే, 2023 జూన్ 15 నుంచి ఈ ఏడాది ఏప్రిల్ వరకు ఆరుగురు ఆత్మహత్యలకు ఒడిగట్టడం అలజడి రేకెత్తించింది. తాజాగా విద్యార్థులు ఆందోళనకు దిగడం ప్రభుత్వ దృష్టికి వెళ్లింది. దాంతో పాటు పదవీ కాలం రెండున్నరేళ్లు పూర్తి కావటంతో వెంకటరమణను బదిలీ చేసిన ప్రభుత్వం గోవర్ధన్‌ను నియమించింది.

సమస్యలు అనేకం

తాజాగా ఇన్‌ఛార్జి ఉపకులపతిగా నియమితులైన ఎ.గోవర్ధన్ బాధ్యతల నిర్వహణ పరీక్షే. సవాలక్ష సమస్యలతో విద్యార్థులు కాలం వెళ్లదీయాల్సి వస్తోంది. ఇంటర్న్‌షిప్ లేదు. ల్యాప్‌టాప్‌లు, ఆధునిక వసతులు అందుబాటులో లేవు. ఒప్పంద పద్ధతిలో పనిచేస్తున్న 90 మంది అధ్యాపకులు, వంద మంది బోధనేతర సిబ్బంది క్రమబద్ధీకరణ అంశం, శాశ్వత ఉపకులపతి కావాలనే విద్యార్థుల ప్రధాన డిమాండ్ అపరిష్కృతంగా ఉన్నాయి. అక్రమాలకు కేంద్రబిందువుగా మారాయనే మెస్‌ల నిర్వహణ అస్తవ్యస్తంగానే ఉంది. ఒక్కో సమస్యను అధ్యయనం చేయటం, ప్రభుత్వంతో సంప్రదింపులు జరపడం, ఆర్జీయూకేటీలో విద్యావ్యవస్థను గాడిన పెట్టడంలో ఇన్‌ఛార్జి ఉపకులపతి గోవర్ధన్ ఏమేరకు సఫలీకృతమవుతారనేది ప్రాధాన్యం సంతరించుకుంటోంది.

రైతులను కంటతడి పెట్టిస్తున్న వాగు


వాగులో ట్రాక్టర్ బోల్తాపడటంతో తడిసిన సోయా సంచులు

ముథోల్, న్యూస్‌టుడే: ముథోల్‌లోని కర్బాల మార్గంలో వాగుపై వంతెన లేకపోవడంతో రైతులు తమ పంట ఉత్పత్తులను తరలించడానికి నానా అవస్థలు పడుతున్నారు. వాగు అవతల వైపు వేలాది ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. అక్కడ పండించిన పంటల ఉత్పత్తులను వాగు దాటి తీసుకురావాలి. వర్షాకాలం వాగులో నిండుగా నీరు ఉండటంతో పంట ఉత్పత్తులను బయటకు తీసుకురావడానికి అష్టకష్టాలు పడాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బుధవారం స్థానిక రైతు సాయినాథ్ వాగు అవతల పొలంలో పండించిన సోయా పంటను ట్రాక్టర్‌లో తీసుకొస్తుండగా నీళ్లలో బోల్తా పడింది. సోయా సంచులు తడిసి పోయాయి. నీటిలో మునిగిపోయిన సంచులను పొక్లెయిన్ సాయంతో బయటకు తీశారు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి వాగుపై వంతెన నిర్మించాలని రైతులు కోరుతున్నారు.


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ అభిలాష అభినవ్, అదనపు కలెక్టర్ కిషోర్‌కుమార్, అధికారులు

పత్తి కొనుగోళ్లకు పకడ్బందీ ఏర్పాట్లు

నిర్మల్, న్యూస్‌టుడే: జిల్లాలో పత్తి కొనుగోళ్లు చేపట్టడానికి పకడ్బందీ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. పత్తి కొనుగోళ్లపై బుధవారం కలెక్టరేట్‌లో సంబంధిత శాఖల అధికారులతో ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడారు. కొనుగోలు కేంద్రాలకు పత్తి తీసుకొచ్చే రైతులకు అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు. నవంబరు మొదటి వారంలో కొనుగోళ్లు ప్రారంభించనున్న నేపథ్యంలో ముందస్తుగా జిన్నింగు మిల్లుల్లో సౌకర్యాలు కల్పించాలని సూచించారు. సీసీఐ ద్వారా పత్తి పంటకు మద్దతు ధర క్వింటాలుకు రూ.7,521 ఉందని, రైతులు 8 శాతం తేమ మించకుండా నాణ్యత ప్రమాణాలు పాటించాలని సూచించారు. పత్తి విక్రయాలకు సంబంధించి కరపత్రాలను ఆవిష్కరించారు.

ధాన్యం కొనుగోళ్లపై.. ధాన్యం కొనుగోళ్లపై సంబంధితశాఖల అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. జిల్లాలో 272 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని, దొడ్డు, సన్నరకాల ధాన్యం కొనుగోలుకు వేర్వేరు కేంద్రాలు ఉండాలన్నారు. కేంద్రాల్లో రైతులు ఇబ్బందులు రాకుండా తాగునీరు సౌకర్యం కల్పించాలన్నారు. ఈనెల 25 వరకు అన్ని కేంద్రాలను ప్రారంభించాలని ఆదేశించారు. అదనపు కలెక్టర్ కిషోర్‌కుమార్, అధికారులు, వ్యాపారులు, రైతులు పాల్గొన్నారు.

మూడు పోలింగ్ కేంద్రాలకు ప్రతిపాదనలు

నిర్మల్: పెంబి మండలంలో కొత్తగా మూడు పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు సిద్ధం చేశామని కలెక్టర్ తెలిపారు. పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్‌లో భాగంగా బుధవారం కలెక్టరేట్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడారు. పెంబి మండలంలోని రాంనగర్, బూరుగుపల్లి, వాస్పల్లి మండల పరిషత్ పాఠశాలల్లో నూతనంగా పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు కొరిపెల్లి శ్రావణ్‌రెడ్డి, గాజుల రవికుమార్, సయ్యద్ హైదర్, నరేశ్, తదితరులు పాల్గొన్నారు.


పునరావాస కాలనీ వద్ద శిక్షణ బీట్ అధికారులు

శిక్షణ బీట్ అధికారుల పర్యటన

కడెం: ఇటీవల రాంపూర్, మైసంపేట గ్రామాల నుంచి తరలి వచ్చిన పునరావాస కాలనీలో బుధవారం శిక్షణ బీట్ అధికారులు పర్యటించారు. అక్కడ ఏర్పాటు చేసిన వసతిని పరిశీలించారు. అనంతరం అటవీ ప్రాంతంలో తిరుగుతూ అక్కడి అందాలను తిలకించారు. కలప స్మగ్లింగ్, జంతువుల వేట జరిగినప్పుడు చేపట్టవలసిన చర్యల గురించి నేర్చుకున్నారు. కడెం రేంజి అధికారిణి గీతారాణి, సెక్షన్ అధికారి రవి, కోర్స్ డైరెక్టర్ స్వరూప పాల్గొన్నారు.

విద్యార్థులతో దరఖాస్తులు చేయించండి

నిర్మల్ అర్బన్: ఎస్‌బీఐ ఫౌండేషన్ ఆశా ఉపకార వేతనాల కోసం జిల్లాలో 6-12 తరగతులు చదివే ప్రతిభావంతులైన విద్యార్థులతో దరఖాస్తులు చేయించేందుకు ప్రధానోపాధ్యాయులు చొరవ చూపాలని డీఈవో రవీందర్‌రెడ్డి తెలిపారు. ఏడాదికి స్కాలర్‌షిప్ రూ.15వేలు అందజేయనున్నారని పేర్కొన్నారు. 75 శాతం మార్కులతో ఉత్తీర్ణులైన పేదలు అర్హులని వెల్లడించారు. www.sbi-fashascholarship.org వెబ్‌సైట్‌లో సంబంధిత ధ్రువపత్రాలతో ఈ నెల 31 లోపు దరఖాస్తులు సమర్పించాలని వివరించారు. జిల్లా నుంచి ఎక్కువ సంఖ్యలో నమోదు అయ్యేలా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.

19న తల్లిదండ్రుల సమావేశం

నిర్మల్ అర్బన్: జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఈ నెల 19న తల్లిదండ్రులు, పోషకుల సమావేశం నిర్వహించాలని డీఈవో ఎ.రవీందర్‌రెడ్డి తెలిపారు. అధిక సంఖ్యలో హాజరయ్యేలా ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు చొరవ తీసుకోవాలని పేర్కొన్నారు. అభివృద్ధి, తదితర విషయాలను చర్చించి, వివరాలు ఐఎస్‌ఎంఎస్/ పాఠశాల ఎడ్యుకేషన్ యాప్‌లో నమోదు చేయాలని వివరించారు.

నేడు సుర్జాపూర్ జాతర

ఖానాపూర్ గ్రామీణం: మండలంలోని సుర్జాపూర్ శ్రీ లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయంలో వార్షిక మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా బుధవారం సుదర్శన నరసింహ యాగం, వివిధ పూజా కార్యక్రమాలు అర్చకులు చక్రపాణి నరసింహమూర్తి, కోటపల్లి అనీష్, నితీష్‌ల మంత్రోచ్ఛరణల మధ్య జరిగాయి. గురువారం జాతర, రథోత్సవం ఉంటాయని నిర్వాహకులు తెలిపారు.

ప్రాణరక్షణ కేంద్రాలు కావాలి..

● నేడు ప్రపంచ ట్రామా దినోత్సవం



ఇదే దిక్కు..

ప్రస్తుతం రిమ్స్‌లో ఉన్న ట్రామా కేర్ యూనిట్ ఇది. ప్రమాదాల బారినపడి ప్రాణాపాయ స్థితిలో వచ్చే బాధితులకోసం ఈ వార్డులో చికిత్సలు అందిస్తున్నారు. శస్త్ర చికిత్సలు అవసరమైతే మాత్రం రెండో అంతస్తులోకి తరలించాల్సి వస్తోంది.

ఉమ్మడి జిల్లాలో ట్రామాకేర్ యూనిట్‌లు అందుబాటులో లేక ప్రమాదాలబారిన పడిన వారి ప్రాణాలు గాలిలో కలుస్తున్నాయి. జాతీయ రహదారులకు సమీపంలో ఉన్న జిల్లా ఆసుపత్రుల్లో ఏర్పాటు చేయాలనుకున్న ట్రామాకేర్ యూనిట్‌లు ప్రతిపాదనదశలోనే మగ్గుతున్నాయి. ఉమ్మడి జిల్లాలోని జాతీయ రహదారి 44, మంచిర్యాల నుంచి కుమురం భీం జిల్లా వాంకిడి మండలం గోయెగాం వరకు ఉన్న 94 కి.మీ.ల 363 నెంబరు రహదారి, నిర్మల్ జిల్లాలో భైంసా వరకు ఉన్న 61వ నెంబరు జాతీయ రహదారులు ప్రమాదకరంగా మారింది. ప్రపంచ ట్రామా దినోత్సవాన్ని పురస్కరించుకొని పరిస్థితులపై 'న్యూస్‌టుడే' కథనం.

న్యూస్‌టుడే, ఆదిలాబాద్ వైద్య విభాగం

ఎందుకంటే!

ప్రపంచ వ్యాప్తంగా రహదారి ప్రమాదాల్లో లక్షల మంది ప్రాణాలు పోగొట్టుకొని వారి కుటుంబాలు చిన్నాభిన్నం అవుతున్నాయి. రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించటానికి 2013 నుంచి 'ట్రామా దినోత్సవం' నిర్వహిస్తున్నారు.

అత్యంత ప్రమాదకరం



గుడిహత్నూర్ మండలం జాతీయ రహదారి-44పై ఉన్న మేకలగండి ప్రాంతం అత్యంత ప్రమాదకరంగా మారింది. ఏడాది కిందట జరిగిన ప్రమాదంలో నలుగురు, ఆ తరువాత చోటు చేసుకున్న ఆటో ప్రమాదంలో మరో ముగ్గురు, ఇటీవల జరిగిన ప్రమాదంలో అయిదుగురు చనిపోయారు.

నిర్మాణంలో క్రిటికల్ కేర్ భవనం



ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారికి వైద్యమందించేందుకు రిమ్స్‌లో ప్రస్తుతం క్రిటికల్ కేర్ భవనం రూ.23.75 కోట్లతో నిర్మిస్తున్నారు. నిర్మాణం పూర్తయ్యాక రూ.11 కోట్లతో అత్యాధునిక యంత్ర పరికరాలు ఇందులో ఏర్పాటు చేయనున్నారు. ఇది త్వరగా పూర్తయితే ప్రాణాపాయ స్థితిలో వచ్చేవారికి ప్రాణప్రదాయినిగా మారనుంది.



ఈ ఏడాది రోడ్డు ప్రమాదాలు (సెప్టెంబరు వరకు)

జిల్లా	ప్రమాదాలు	మృతులు	క్షతగాత్రులు
ఆదిలాబాద్	202	92	154
నిర్మల్	284	111	291
మంచిర్యాల	384	134	325
కుమురంభీం	87	64	172

ప్రతిపాదన దశలోనే..

రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 25 చోట్ల ట్రామా కేర్ కేంద్రాలు ఏర్పాటు చేయటానికి 2022లో అప్పటి ప్రభుత్వం ప్రతిపాదనలు చేసింది. జాతీయ రహదారిపై ఎక్కువ ప్రమాదాలు చోటు చేసుకుంటుండటంతో నిర్మల్, ఆదిలాబాద్‌లో వీటిని ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. కాని అవి ప్రతిపాదన దశలోనే ఉండిపోయాయి.

మూలమలుపులతో..



మంచిర్యాల జిల్లాలోని జాతీయ రహదారి 363పై తాండూరు మండలంలో బోయపల్లిగేటు వద్ద చోటు చేసుకున్న ఆటో ప్రమాదం ఇది. ట్రామాకేర్‌లు అందుబాటులో లేక మంచిర్యాల ఆసుపత్రిలో చికిత్స అందజేశారు.

ఉమ్మడి జిల్లాలో బ్లాక్ స్పాట్లు ఇవే..

◆ **ఆదిలాబాద్** జిల్లాలో 44వ జాతీయ రహదారిపై జందాపూర్ ఎక్స్‌రోడ్డు, భోరజ్, మావల సమీపంలోని దేవాపూర్ ఎక్స్‌రోడ్డు, గుడిహత్నూర్ మండలం మేకలగండి, ఇచ్చోడ మండలం గాంధీనగర్, నేరడిగొండ మండలం కుప్టి, దూద్‌గండి, కొరటికల్ మూలమలుపు

◆ **మంచిర్యాల** జిల్లాలో ఇందారం, శ్రీరాంపూర్ ఎక్స్‌రోడ్డు, సోముగూడెం, రేపల్లెవాడ, తాండూర్ రైల్వే గేటు, బోబెపల్లి బోర్డు ప్రాంతాలు.

◆ **నిర్మల్** జిల్లాలోని 61వ జాతీయ రహదారిపై చిట్యాల, దిలావర్‌పూర్, కల్లూర్, నర్సాపూర్, నసీరాబాద్ ప్రాంతాలు

◆ **కుమురంభీం** జిల్లా గుండా వెళ్లే 363 జాతీయ రహదారిపై వాంకిడి, కాగజ్‌నగర్ ఎక్స్‌రోడ్డు, రెబ్బెన గోలేటి, తాండూరు ప్రాంతాల్లో ప్రమాదాలు తరచూ చోటు చేసుకుంటున్నాయి.

కొలువుదీరిన నిర్మల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గం


ప్రమాణ స్వీకారం చేస్తున్న నిర్మల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గ సభ్యులు

నిర్మల్, న్యూస్‌టుడే: నిర్మల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గం కొలువుదీరింది. బుధవారం స్థానిక వ్యవసాయ మార్కెట్ కార్యాలయ ఆవరణలో పాలకవర్గ ప్రమాణ స్వీకారోత్సవం జరిగింది. మార్కెటింగ్‌శాఖ ఏడీ శ్రీనివాస్ పాలకవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఛైర్మన్‌గా సోమ భీంరెడ్డి, వైస్ ఛైర్మన్‌గా ఈటెల శ్రీనివాస్, డైరెక్టర్లుగా జి.గజేందర్, జి.గంగారాం, కె.రాజారెడ్డి, వంజరి రూప, ఎం.ఎ.అజీం, సి.మురళి, పి.వంశీకృష్ణ, నిమ్మ సాయన్న, ఆర్.వెంకటేశ్, సుంకరి సురేశ్, సయ్యద్ ఖలీల్, మంత్రి రాజ్‌గోపాల్, మున్సిపల్ ఛైర్మన్ గండ్రత్ ఈశ్వర్‌లు ప్రమాణం చేశారు. అనంతరం మార్కెట్ కమిటీ ఛైర్మన్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమం కోసం పనిచేస్తుందన్నారు. అందరి సహకారంతో నిర్మల్ మార్కెట్ కమిటీని అభివృద్ధి పథంలో తీసుకెళ్తానని చెప్పారు. తన ఛాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. పాలకవర్గ సభ్యులను మార్కెట్ కమిటీ అధికారులు సన్మానించారు. నిర్మల్ మాజీ ఎంపీపీ రామేశ్వర్‌రెడ్డి, తెలంగాణ ఉద్యమకారుల సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కొట్టె శేఖర్, పలు మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, కార్యదర్శులు, నాయకులు పాల్గొన్నారు.

హైకోర్టు పచ్చజెండా

● సారంగాపూర్ మార్కెట్ కమిటీ పాలకవర్గం ప్రమాణ స్వీకారం

సారంగాపూర్, న్యూస్‌టుడే: సారంగాపూర్ మార్కెట్ కమిటీ పాలకవర్గం బుధవారం సాయంత్రం 6 గంటలకు ప్రమాణస్వీకారం చేసింది. బీసీకి కేటాయించిన ఈ స్థానానికి బీసీయేతరుడిని ఛైర్మన్‌గా ఎంపిక చేశారని స్థానిక కాంగ్రెస్ నాయకులు మంగళవారం హైకోర్టును ఆశ్రయించి స్టే పొందిన విషయం తెలిసిందే. దీంతో బుధవారం మధ్యాహ్నం తలపెట్టిన పాలకవర్గం ప్రమాణ స్వీకారం కార్యక్రమాన్ని వాయిదా వేసినట్లు అధికారులు ప్రకటించారు. కానీ ఈ అంశాన్ని ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న అబ్దుల్‌హాదీ వర్గీయులు ఆగమేఘాల మీద బుధవారం హైకోర్టును ఆశ్రయించారు. అబ్దుల్‌హాదీ బీసీగా రుజువులు చూపడంతో ఏకీభవించిన హైకోర్టు కేసు కొట్టివేస్తూ వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారానికి అనుమతి ఇచ్చింది. నూతన పాలకవర్గంతో ప్రమాణ స్వీకారం చేయించాలని జిల్లా మార్కెటింగ్ అధికారి, సారంగాపూర్ మార్కెట్ కార్యదర్శులను ఆదేశించింది.


ఛైర్మన్ అబ్దుల్ హాదికి శుభాకాంక్షలు తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

ఛైర్మన్‌గా అబ్దుల్ హాది ప్రమాణం

హైకోర్టు కేసు కొట్టివేయడంతో నూతన పాలకవర్గ ప్రమాణస్వీకారానికి స్థానిక మార్కెట్ కమిటీ అధికారులు ఏర్పాట్లు చేశారు. సాయంత్రం 6 గంటలకు స్థానిక కార్యాలయంలో ఛైర్మన్‌గా అబ్దుల్ హాది, వైస్ ఛైర్మన్‌గా లక్కడి శంకర్‌రెడ్డితో పాటు సభ్యులను జిల్లా మార్కెటింగ్ అధికారి శ్రీనివాస్ సమక్షంలో మార్కెట్ కార్యదర్శి దూమడనాయక్ ప్రమాణస్వీకారం చేయించారు. ఆ వెంటనే అబ్దుల్ హాది మార్కెట్ ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టారు. అనంతరం నూతన అధ్యక్ష, ఉపాధ్యక్షులతో పాలకవర్గ సభ్యులను స్థానిక కార్యాలయ అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో నిర్మల్ మార్కెట్ కమిటీ ఛైర్మన్ సోమ భీంరెడ్డి, కాంగ్రెస్ నాయకులు రాజ్‌మహ్మద్, శ్రీనివాస్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, వెంకటరమణారెడ్డి, మారుతి, మల్లేష్, రాజ్‌కుమార్, మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.

నుడా పరిధిలోకి.. 430 రెవెన్యూ గ్రామాలు

● ప్రభుత్వానికి చేరిన ప్రతిపాదన దస్త్రం

నిర్మల్, న్యూస్‌టుడే: నిర్మల్, భైంసా, ఖానాపూర్ పట్టణాలతోపాటు 430 రెవెన్యూ గ్రామాలను కలిపి నిర్మల్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (నుడా) ఏర్పాటు చేయాలని అధికారులు నిర్ణయించారు. తొలుత నిర్మల్ పట్టణ పరిధి నుంచి 20 కిలోమీటర్లు, ఆ తర్వాత 40 కిలోమీటర్ల పరిధిలోకి వచ్చే గ్రామాలకు ఈ సంస్థ పరిధిలోకి తీసుకోవాలని భావించారు. ఇలా చేస్తే జిల్లా తూర్పు, పడమర ప్రాంతాల్లోని అయిదారు మండలాలు సంస్థ పరిధిలోకి వచ్చే అవకాశం కనిపించలేదు. దీంతో భవిష్యత్తులో ఆయా మండలాల్లో అభివృద్ధి కుంటుపడే అవకాశం ఉంటుందని భావించిన అధికార యంత్రాంగం జిల్లాలోని అన్ని మండలాలు నుడా పరిధిలోకి వచ్చేలా ప్రతిపాదనలు సిద్ధం చేసి ఆ దస్త్రాన్ని ప్రభుత్వానికి పంపించారు. నిర్మల్, భైంసా, ఖానాపూర్ మున్సిపాల్టీల్లో చుట్టూ ఉన్న గ్రామాలను విలీనం చేయకుండా ప్రత్యేకంగా జిల్లాను పట్టణాభివృద్ధి సంస్థగా ఏర్పాటు చేయనుండటంతో పట్టణాలు, గ్రామాల్లో అభివృద్ధి పనులు, మౌలిక వసతులు మెరుగుపడనున్నాయి.




నుడా పరిధిలోకి వచ్చే జిల్లా చిత్రపటం

అభివృద్ధికి అవకాశం

జిల్లాలోని మూడు పట్టణాలు, 18 గ్రామీణ మండలాల్లో 3,598.11 చదరపు కిలోమీటర్లు నుడా పరిధిలోకి తీసుకొచ్చేందుకు అధికారులు రూపకల్పన చేశారు. ప్రభుత్వానికి పంపించిన ప్రతిపాదన దస్త్రానికి ఆమోదముద్ర పడితే 'నుడా' ఏర్పాటవుతుంది. ఇందుకోసం జిల్లా కేంద్రంలో ప్రత్యేకంగా కార్యాలయాన్ని ఏర్పాటు చేస్తారు. నామినేటెడ్ పద్ధతిని నుడా ఛైర్మన్‌ను నియమిస్తారు. పురపాలక కమిషనర్ వైస్ ఛైర్మన్‌గా కొనసాగుతారు. ముఖ్య ప్రణాళిక అధికారిని నియమిస్తారు. పట్టణ ప్రణాళిక విభాగం, డీటీపీసీ సిబ్బందిని ప్రత్యేకంగా కేటాయిస్తారు. ఈ సంస్థకు నేరుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ప్రత్యేక నిధులు మంజూరవుతాయి. సంస్థ పరిధిలోకి వచ్చే గ్రామాలతోపాటు మూడు పట్టణాలకు ఈ నిధులను వెచ్చిస్తారు. రహదారులు, మురుగుకాలువలు, సెంట్రల్ లైటింగ్, విభాగినుల ఏర్పాటు, ఇతరత్రా అభివృద్ధి పనులు చేపట్టడంతోపాటు మౌలిక వసతులు కల్పిస్తారు. ప్రస్తుతం గ్రామాల్లో రెండంతస్తుల వరకు అనుమతి లభిస్తుండగా.. సంస్థ పరిధిలోకి వచ్చే గ్రామాల్లో అయిదు అంతస్తుల వరకు నిర్మాణాలు చేసుకునేందుకు ఈ సంస్థ అనుమతులు ఇస్తుంది. లేఅవుట్లు అనుమతులు సైతం ఈ సంస్థ ద్వారా తీసుకోవాల్సి ఉంటుంది. జిల్లా కలెక్టర్ పర్యవేక్షణలో ఈ సంస్థ కార్యకలాపాలు కొనసాగుతాయి. అయితే, సంస్థ పరిధిలోకి వచ్చే గ్రామాల్లో యథావిధిగా కార్యదర్శుల పాలన కొనసాగుతుంది. ఇతర అభివృద్ధి ప్రణాళికలు, నిర్మాణ అనుమతులకు మాత్రం సంస్థ ఇవ్వాల్సి ఉంటుంది.

మరిన్ని సౌకర్యాలు



ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విడుదల చేసే అరకొర నిధులతో పట్టణాలు, గ్రామాల్లో ఆశించిన అభివృద్ధి జరగడం లేదు. కేవలం 15వ ఆర్థిక సంఘ నిధులు మాత్రమే విడుదల అవుతున్నాయి. ఈ నిధులతో రహదారులు, మురుగుకాలువల నిర్మాణాలు, వీధి దీపాల ఏర్పాటు, ఇతరత్రా అభివృద్ధి పనులు అంతంత మాత్రంగానే జరుగుతున్నాయి. సంస్థ ఏర్పాటైతే ప్రత్యేక నిధులు మంజూరు కానుండటంతో పట్టణాలతోపాటు పల్లెల్లో ప్రగతి రేఖలు కనిపిస్తాయి. త్వరలోనే నుడా ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చే అవకాశం ఉందని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.

18న ప్రజాగళం సభ

దిలావర్‌పూర్, న్యూస్‌టుడే: దిలావర్‌పూర్ గ్రామ శివారులో ఇథనాల్ పరిశ్రమ ఏర్పాటును వ్యతిరేకిస్తూ ఈనెల 18న స్థానిక పోచమ్మ మందిరం సమీపంలో ప్రజాగళం పేరిట బహిరంగసభ నిర్వహిస్తున్నట్లు పరిశ్రమ వ్యతిరేక ఐకాస నాయకులు తెలిపారు. పరిశ్రమను ఈ ప్రాంతం నుంచి తరలించేలా ఒత్తిడి పెంచేందుకు బుధవారమిక్కడ సభ ఏర్పాటుకు సన్నాహాలు చేశారు. కానీ చివరి క్షణంలో పోలీసులు సభకు అనుమతి ఇవ్వక పోవడంతో నిర్వాహకులు హైకోర్టును ఆశ్రయించారు. వారి వాదనలు విన్న న్యాయస్థానం సభ నిర్వహణకు అనుమతులు ఇచ్చింది. దీంతో నిర్వాహకులు సభ నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు.





మేమున్నాం.. మీకు తోడుగా...

నిర్మల్ 97053 46693
భైంసా 63099 94649
ఖానాపూర్ 96401 62091

?: పుస్పూర్-బోరిగాం, మన్మద్-హవర్గ, కన్యాపూర్-బ్రహ్మేశ్వర్, రాజురా-గడ్‌చంద రహదారులు అధ్వానంగా మారాయి. వాటికి మరమ్మతులు చేపట్టాలి. - **రాజేశ్వర్, పుస్పూర్**

✓: మరమ్మతుల కోసం ప్రతిపాదనలు పంపించాం. నిధులు మంజూరు కాగానే పనులు చేపడుతాం. -**రాజేందర్, పంచాయతీరాజ్ డీఈఈ**

-న్యూస్‌టుడే, లోకేశ్వరం

?: ఖానాపూర్ శివారు మధురానగర్‌లో సీసీ రహదారి దెబ్బతిని వాహనాలు వెళ్లడానికి ఇబ్బందిగా మారింది. - **మహేష్, కాలనీవాసి**

✓: దెబ్బతిన్న సీసీ రహదారిని పరిశీలించి అవసరమైన చోట మరమ్మతులు చేయిస్తాం. - **రత్నాకర్‌రావు ఎంపీవో, ఖానాపూర్**

-న్యూస్‌టుడే, ఖానాపూర్

అక్రమంగా నమోదు చేసిన కేసులను తొలగించాలి



ఎస్పీ జానకి షర్మిలకు వినతిపత్రం అందిస్తున్న హిందూ సంఘాల ప్రతినిధులు

కుభీరు, న్యూస్‌టుడే: హిందూ యువకులపై అక్రమంగా నమోదు చేసిన కేసులను తొలగించాలని కోరుతూ కుభీరు పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఎస్పీ జానకి షర్మిలకు హిందూ సంఘాల ఆధ్వర్యంలో వినతిపత్రాన్ని అందించారు. ఎనిమిది మంది యువకులపై కేసుల నమోదుతో పాటు, అరెస్ట్ చేసిన సందర్భాన్ని పురస్కరించుకొని హిందూ సంఘాలు కుభీరులో ఆందోళన చేపట్టాయి. విషయం తెలుసుకున్న ఎస్పీ కుభీరు రాగా వినతిపత్రం అందించి మాట్లాడారు. ప్రజలు వివాదాలకు పోకుండా కలిసికట్టుగా ఉండాలని ఎస్పీ యువకులకు సూచించారు. పోలీసులు తమపని తాము చేసుకుంటూ వెళ్తారని చెప్పారు.

'బీసీ అభ్యర్థులకు మద్దతు'

నిర్మల్, న్యూస్‌టుడే: త్వరలో జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీసీ అభ్యర్థులకు మద్దతు ప్రకటిస్తామని బీసీ కులాల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు నిమ్మ గణేశ్, ప్రధాన కార్యదర్శి జి.కిషన్ తెలిపారు. బుధవారమిక్కడ వారు విలేకరులతో మాట్లాడారు. అన్ని పార్టీలు బీసీ అభ్యర్థులకు ఎమ్మెల్సీ టికెట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఇతరులకు టికెట్లు కేటాయిస్తే తమ వేదిక తరఫున బీసీ అభ్యర్థిని పోటీ చేయించి సత్తా చూపిస్తామన్నారు. గతంలో బీసీలలో ఐకమత్యం లేకపోవడంతో రాజకీయంగా ముందుకు వెళ్లలేకపోయామని, ఇకపై ఏ ఎన్నికలు జరిగినా బీసీ అభ్యర్థులకు అండగా ఉంటామని చెప్పారు. నాయకులు శ్రీకాంత్, రాజు, రామకృష్ణ, శ్రీహరి, సతీష్, శంకర్, జుబేద్ పాల్గొన్నారు.

వీసీ మార్పుపై విద్యార్థి సంఘాల హర్షం

ముథోల్(బాసర): బాసర ఆర్జీయూకేటీ ఇన్‌ఛార్జి ఉపకులపతి వెంకటరమణ స్థానంలో నూతన వీసీని నియమించడంపై తెలంగాణ స్టూడెంట్స్ అసోసియేషన్ ఫర్ సాలిడారిటీ ఆధ్వర్యంలో విశ్వవిద్యాలయం విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. ఇన్ని రోజులు విద్యార్థుల సమస్యలను నిర్లక్ష్యం చేసిన ఇన్‌ఛార్జి ఉపకులపతిని మార్చడం సంతోషంగా ఉందన్నారు. తమను ఎంత భయపెట్టినా వెరవకుండా తాము చేసిన పోరాట ఫలితమే ఈ మార్పు అని అభివర్ణించారు.

ముథోల్(బాసర): ఇన్‌ఛార్జి ఉపకులపతి వెంకటరమణపై ప్రభుత్వం విజిలెన్స్ విచారణ చేపట్టాలని ఓయూ ఐకాస కన్వీనర్ సర్దార్ వినోద్ డిమాండ్ చేశారు. ముథోల్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. అవినీతి, అక్రమాలకు పాల్పడి డబ్బులు దండుకున్నారని ఆరోపించారు.

కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

దిలావర్‌పూర్: కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ స్వాతి, పీఏసీఎస్ ఛైర్మన్ రమణరెడ్డి కోరారు. బన్సపల్లి పీఏసీఎస్ ఆధ్వర్యంల బుధవారం దిలావర్‌పూర్‌లో సోయా, ధాన్యం కొనుగోలు కేంద్రాలను వారు ప్రారంభించారు. సోయా క్వింటాకు రూ.1830, ధాన్యం క్వింటా ఏ గ్రేడు ధాన్యానికి రూ.2320, బీ గ్రేడు ధాన్యానికి రూ.2300 చెల్లిస్తామని తెలిపారు. ఏవో రాజశేఖర్, ఏఈవోలు, సంఘ డైరెక్టర్‌లు పాల్గొన్నారు.

లోకేశ్వరం: మండలంలోని ధర్మోర, రాయపూర్‌కాండ్లి గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం పీఏసీఎస్ అధ్యక్షుడు రత్నాకర్‌రావు ప్రారంభించారు. నాయకులు నారాయణరెడ్డి, సుదర్శన్‌రెడ్డి, భాస్కర్, గంగయ్య, సుధీర్‌రెడ్డి, నర్సయ్య, శ్రీనివాసురావు తదితరులు పాల్గొన్నారు.

శబరికి పాదయాత్ర

భైంసా గ్రామీణం: మండలంలోని వానల్‌పాడ్, తిమ్మాపూర్ గ్రామాలకు చెందిన రాము పటేల్, గణేష్ అయ్యప్ప భక్తులు బుధవారం శబరి అయ్యప్ప పుణ్యక్షేత్రానికి పాదయాత్ర చేపట్టారు. స్థానిక ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కుటుంబీకులు, గ్రామస్థులు భక్తి శ్రద్ధలతో స్వాములను సాగనంపారు.

పండగ వేళ.. పట్నం నుంచి పల్లెలకు

● ఆటపాటలతో మహిళలు, చిన్నారుల సందడి

కుంటాల, న్యూస్‌టుడే: తెలవారింది మొదలు పొద్దస్తమానం ఎన్నో వ్యాపకాలతో సతమతమవుతున్న వారికి ఆధ్యాత్మిక చింతన మానసిక ప్రశాంతతను చేకూరుస్తుంది. వ్యాయామం ద్వారా ఆరోగ్యాన్ని కూడా ప్రసాదిస్తోంది. ఇతిహాసాలు, పురాణాలు చదవడానికే పరిమితమైతే సరిపోదు.. తెలుసుకున్న దాన్ని ఆచరించి భావితరాలకు అందించినప్పుడే మన సంస్కృతికి విలువ. నవరాత్రి ఉత్సవాల్లో మహిళలు, చిన్నారులు పెద్దలు చెప్పిన మాటలను నిజం చేసి చూపించారు. కోలాటం, బతుకమ్మ, బోనాలు, ఆటపాటలతో ఆకట్టుకున్నారు. అటు ఆధ్యాత్మిక చింతన.. ఇటు ఆరోగ్యం.. మానసిక ప్రశాంతత అన్నీ ఒకే అంశంతో సాధ్యమవుతున్నాయి. ఆటపాటలు, సంప్రదాయ దుస్తులు సంస్కృతిని చాటి చెప్పాయి.

భావితరాలకు అందించాలని..:



కేశెట్టి శ్రేయ, సాఫ్ట్‌వేర్ డెవలపర్, పుణె (లింబా-బి)

నేటితరం సంస్కృతి సంప్రదాయలకు దూరమవుతున్నారు. అందరికి మన నాగరికత గుర్తుండాలంటే మనం ఆచరిస్తేనే అందరూ అనుసరిస్తారు. అందుకే ప్రత్యేకంగా దృష్టి సారించి కోలాటం నేర్చుకున్నా. ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలతో మనసు ప్రశాంతంగా ఉంటుంది. దీనిని కొనసాగించి ఆధ్యాత్మిక ప్రపంచాన్ని సృష్టించడానికి అంతా కలిసి ముందుకు రావాలి. మంచి ఆలోచనలు, సేవా గుణం అలవడుతోంది.

భక్తి భావన పెరుగుతుంది..:



కేశెట్టి సుహాసిని, ఎమ్మెస్సీ, హైదరాబాద్ (లింబా-బి)

పని ముగించుకున్నాక.. ఖాళీ సమయంలో కబుర్లు చెప్పుకునే బదులు కోలాటం, ఆధ్యాత్మిక పాటలు పాడుతూ ఆడుతుంటే చాలా సంతోషంగా ఉంది. అందరం కలిసి ఉల్లాసంగా ఆడిపాడాం. అంతే కాకుండా ఇంట్లో పని చేస్తున్నప్పుడు పద్యాలు వల్లె వేయడం ద్వారా సులువుగా అనిపిస్తుంది. దీని వల్ల వ్యాయామం, ఆరోగ్యం, మానసిక ప్రశాంతత అన్నీ సాధ్యమవుతున్నాయి. దసరా వేడుకలను సంబరంగా గడిపాం.

మానసిక ఉల్లాసం..:



డాక్టర్ చాట్ల లత, కంటి వైద్య నిపుణురాలు, హైదరాబాద్ (నర్సాపూర్-జి)

దసరా ఉత్సవాల్లో కోలాటం ఆడాం. ఆసక్తిగల చిన్నారులకు నేర్పించా. తోటివారితో మాట్లాడటం, అందరితో కలిసిపోవడం ఆనందంగా ఉంది. బతుకమ్మ, కోలాటంతో మానసికోల్లాసం కలుగుతోంది. దేవుని సన్నిధిలో కోలాట ప్రదర్శన చేయడం తృప్తినిస్తోంది. సాధన చేయడంతో పాటు నేర్చుకున్న ఆటను ప్రదర్శిస్తే ఆనందమే వేరు. శారీరక, మానసిక ఉల్లాసాన్ని ఇస్తోంది.

సంప్రదాయాలంటే ఇష్టం..:



చాట్ల ఇందిర, అధ్యాపకురాలు, హైదరాబాద్ (నర్సాపూర్-జి)

సంప్రదాయలంటే ఎంతో ఇష్టం. విద్యార్థి దశ నుంచే సంప్రదాయ ఆటలపై దృష్టి సారించా. ఆ ఆటలను ఇష్టపడి నేర్చుకున్నా. సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించాలనే ఉద్దేశంతో అందరికి నేర్పిస్తున్నా. కళాశాలలో జరిగే వేడుకల్లో విద్యార్థులకు సంప్రదాయ ఆటలు, పాటలపై తర్ఫీదు ఇస్తా. మన సంస్కృతికి గౌరవం ఇచ్చినప్పుడే దేశ గొప్పతనం ఇతరులకు తెలుస్తుంది.

విధుల్లో చేరిన నూతన ఉపాధ్యాయులు

ముథోల్, న్యూస్‌టుడే: బాసర, ముథోల్ మండలాల్లో కలిపి బుధవారం 26 మంది కొత్త ఉపాధ్యాయులు ఆయా పాఠశాలల్లో చేరారు. మంగళవారం వారు పోస్టింగ్‌లు అందుకున్నారు. బుధవారం ఉదయం ఆయా మండల విద్యాధికారి కార్యాలయాల్లో రిపోర్టు చేశారు. ముథోల్ మండలంలో నలుగురు ఉపాధ్యాయులు ఉన్నత పాఠశాలల్లో, ఆరుగురు ప్రాథమిక పాఠశాలలో చేరారు. బాసర మండలంలో ఉన్నత పాఠశాలలో ఐదుగురు, ప్రాథమిక పాఠశాలలో 9 మంది చేరారు.

భైంసా గ్రామీణం: మండలంలోని ఆయా పాఠశాలలకు 11 మంది ఉపాధ్యాయులను కేటాయించారని ఎంఈఓ సుభాష్ తెలిపారు. అయిదుగురు ఎస్‌జీటీలు, అయిదుగురు ఎస్ఏలు, ఒకరు పీఈటీ వారందరూ బుధవారం విధుల్లో చేరారు.

దస్తూరాబాద్: నూతన ఉపాధ్యాయులకు మండల విద్యాధికారి గంగాధర్ పాఠశాలల నియామక పత్రాలను అందించారు. అనంతరం వారు తమకు కేటాయించిన పాఠశాలలకు వెళ్లి విధుల్లో చేరారు.

ఖానాపూర్, ఖానాపూర్ గ్రామీణం, పెంబి: డీఎస్సీలో ఉపాధ్యాయులుగా ఎంపికైన వారికి పోస్టింగ్‌లు ఇవ్వడంతో బుధవారం ఎంఈవో కార్యాలయంలో నియామక పత్రాలతో రిపోర్టు చేశారు. ఖానాపూర్ పట్టణంతో పాటు మండలంలోని ఆయా పాఠశాలలకు మొత్తం 23 మంది ఉపాధ్యాయులు ఉద్యోగంలో చేరారని ఎంఈవో తెలిపారు. సుర్జాపూర్ జడ్పీ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ బయోసైన్స్, రాజూరా పాఠశాలలో ఎస్-సోషల్, బీర్నందిలో ఎస్ఏ-సోషల్, ఎస్ఏ-బయోసైన్స్, ఖానాపూర్ బాలికల ఉన్నత పాఠశాలలో ఎస్ఏ-సోషల్, బాలుర ఉన్నత పాఠశాలలో ఎస్ఏ-సోషల్, ఎస్ఏ-బయోసైన్స్, ఎస్ఏ-సోషల్(ఉర్దూ మీడియం), తిమ్మాపూర్ ఎస్ఏ-హిందీ పోస్టులను భర్తీ చేశారు. మస్కాపూర్ ఉన్నత పాఠశాలకు ఏడుగురిని కేటాయించడంతో బుధవారం ఆరుగురు విధుల్లో చేరారు. పెంబి మండలం నుంచి 21 మంది ఉపాధ్యాయులు ఇతర ప్రాంతాలకు బదిలీపై వెళ్లారు. వీరి స్థానంలో ఇటీవలే డీఎస్సీల్లో ఎంపికైన కొత్త ఉపాధ్యాయులు బుధవారం స్థానిక ఎమ్మార్సీ భవనంలో రిపోర్ట్ చేసినట్లు ఎంఈఓ రాంచందర్ తెలిపారు.

నర్సరీలో మొక్కలు వృథా



నర్సరీలో ఎండిన మొక్కలు

నర్సాపూర్(జి), న్యూస్‌టుడే: మండల కేంద్రంలో రైతువేదిక వద్ద ఏర్పాటుచేసిన పంచాయతీ నర్సరీలోని మొక్కలను వర్షాకాలం పూర్తయినా పంపిణీ చేయకపోవడంతో సుమారు 400 వరకు ఎండిపోయాయి. కానుగ, సుబాబుల్, దానిమ్మ లాంటి మొక్కలను పెంచిన చోటనే వదిలేశారు. రైతువేదికలో తరచూ జరిగే అధికారిక సమావేశాల్లో పాల్గొంటున్న అధికారులు వాటిని చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రూ.లక్షల వ్యయంతో చేపట్టిన మొక్కలు అధికారుల నిర్లక్ష్యం కారణంగా వృథా అవుతున్నాయని గ్రామస్థులు అభిప్రాయ పడుతున్నారు.

వినియోగం పెంచాలి

దిలావర్‌పూర్: గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలో చెత్త నుంచి తయారు చేస్తున్న సేంద్రియ ఎరువులను రైతులు తమ పంట పొలాల్లో వినియోగించేలా అవగాహన కల్పించాలని డీఎల్‌పీవో రమేష్ కోరారు. బుధవారం మండలంలోని సిర్గాపూర్ నర్సరీ నిర్వహణ, సెగ్రిగేషన్ షెడ్డును గ్రామ పంచాయతీ రికార్డులను పరిశీలించారు. ఎంపీవో గోవర్ధన్ పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన

నిర్మల్ పట్టణం: నీట్‌లో ప్రతిభ చాటి ఇటీవల పలు వైద్యకళాశాలల్లో సీట్లు సాధించిన దీక్షిత, విఘ్నేశ్, అక్షయ, శ్రీనికేత్, నిశిత్‌రెడ్డి, రాగవర్షిణి, నిధిరెడ్డి, ప్రహర్ష, వర్షిణి, సిరిచందన, రేణికరెడ్డిని స్థానిక వాసవి పాఠశాలలో బుధవారం సన్మానించారు. తమ పూర్వవిద్యార్థులు ఉన్నత కోర్సుల్లో ప్రవేశం పొందడంపై హర్షం వ్యక్తంచేశారు. కార్యదర్శి జగదీశ్వర్‌రెడ్డి, కరస్పాండెంట్ పోతారెడ్డి, ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్ శెట్టి పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య



అరవింద్

కుంటాల: జీవితంపై విరక్తితో ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని సేవాలాల్ తండాలో జరిగింది. ఏఎస్సై దేవ్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. తండాకు చెందిన చవాన్ అరవింద్ (28) మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో తీవ్ర మనస్తాపంతో బుధవారం తెల్లవారుజామున ఇంట్లో దూలానికి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆరుబయట మంచంలో నిద్రించిన అరవింద్ కనిపించకపోవడంతో కుటుంబీకులు పక్క గదిలో చూడగా విగతజీవిగా వేలాడుతూ కనిపించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

నేర వార్తలు

చికిత్స పొందుతూ విశ్రాంత ఉపాధ్యాయుడి మృతి



నఫేఖాన్

ఖానాపూర్: నిర్మల్ పట్టణానికి చెందిన ప్రభుత్వ విశ్రాంత ఉపాధ్యాయుడు నఫేఖాన్ ఈ నెల 14న ద్విచక్రవాహనంపై వ్యక్తిగత పనిమీద ఖానాపూర్ వచ్చారు. అదే రోజు రాత్రి నిర్మల్‌కు తిరుగు ప్రయాణమయ్యారు. ఈ క్రమంలో ఖానాపూర్ మండలం ఎక్బాల్‌పూర్ వద్దకు చేరుకోగానే బైక్ అదుపుతప్పి డివైడర్‌ను వేగంగా ఢీకొన్నాడు. ప్రమాదంలో నఫేఖాన్ తలకు తీవ్రగాయమైంది. కుటుంబ సభ్యులు చికిత్స కోసం హైదరాబాద్ తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతిచెందాడని ఎస్సై రాహుల్‌గైక్వాడ్ తెలిపారు.

సహాయక లైన్‌మెన్‌కు విద్యుదాఘాతం

భైంసా గ్రామీణం: విద్యుత్ మరమ్మతులు చేస్తుండగా ఓ లైన్‌మెన్‌కు ప్రమాదవశాత్తు తీవ్ర గాయాలైన ఘటన భైంసా పట్టణంలో బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నర్సాపూర్(జి) మండలం తురాటి గ్రామానికి చెందిన పులి జైపాల్ భైంసా పట్టణ సబ్‌స్టేషన్ పరిధిలో సహాయక లైన్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్నారు. పట్టణం సమీపంలో డబుల్‌బెడ్రూం కాలనీలో విద్యుత్ మరమ్మతులు చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్తు తీగలు తగలడంతో ఒక్కసారిగా కింద పడిపోయారు. గమనించిన స్థానికులు పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తరలించారు. విషయం తెలుసుకున్న డీఈ శ్రీనివాస్‌రెడ్డి, ఏడీఈ ఆదిత్య తదితరులు ఆసుపత్రికి చేరుకున్నారు.

ఆప్యాయంగా మాట్లాడి.. అనుభవాలు తెలుసుకొని..!



వృద్ధురాలికి పండ్లు అందిస్తున్న విద్యార్థి

నిర్మల్ పట్టణం, న్యూస్‌టుడే: విద్యార్థులంటే నాలుగు గోడల నడుమ పాఠ్యపుస్తకాలను చదవడమే కాదు.. సమకాలీన విషయాలపైనా అవగాహన కలిగిఉండాలి. సామాజిక అంశాల్లో భాగమవ్వాలి. అప్పుడే చదువుతో పాటు జ్ఞానమూ వికసిస్తుంది. ఈ కారణంగానే ప్రస్తుతం ప్రభుత్వ, ప్రైవేటు తేడా లేకుండా చాలా పాఠశాలల్లో క్షేత్రస్థాయి అధ్యయనానికి, ప్రత్యేక కార్యక్రమాల నిర్వహణకు ప్రాధాన్యమిస్తున్నారు. ఇదే రీతిలో స్థానిక వాసవి వరల్డ్ పాఠశాల ఆధ్వర్యంలో బుధవారం ఆహార దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులను స్థానికంగా ఉన్న డవ్ వృద్ధాశ్రమానికి తీసుకెళ్లారు. అక్కడ వృద్ధులకు పండ్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. కుటుంబ సభ్యుల్లేక కొందరు, అందరికీ దూరమై కొందరు ఒంటరిగా గడుపుతున్న పరిస్థితుల్లో ఎలాంటి పరిచయం లేకపోయినా పిల్లలందరూ కలుసుకోవడం వారిలో సంతోషం నింపింది. అందరితో ఆప్యాయంగా మాట్లాడారు. అనుభవాలను, సాదకబాధకాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ శైలాజాయ్‌సన్ మాట్లాడుతూ ఆహారం విలువను గుర్తించాలని, కష్టపడి పండించిన ధాన్యాన్ని వృథా చేయొద్దని చెప్పారు. పెద్దలను భారంగా భావించకుండా ఆప్యాయంగా చూసుకోవాలన్నారు. ఆశ్రమ ఇన్‌ఛార్జి రాము, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

కొనసాగుతున్న నిరసన



మామడలో నిరసన తెలుపుతున్న డిగ్రీ కళాశాల అధ్యాపకులు, సిబ్బంది

మామడ, న్యూస్‌టుడే: విద్యార్థుల బోధన రుసుములు విడుదల చేయాలన్న డిమాండ్‌తో డిగ్రీ కళాశాలల యాజమాన్యాలు నిర్వహిస్తున్న నిరవధిక బంద్ కొనసాగుతోంది. మూడో రోజైన బుధవారం మామడ ఏకశిల కళాశాల అధ్యాపకులు, సిబ్బంది ఫ్లకార్డులు పట్టుకొని నిరసన తెలిపారు. ప్రిన్సిపల్ శ్రీధర్, సిబ్బంది పాల్గొన్నారు.

కుంటాల: ఫీజు బకాయిలను వెంటనే విడుదల చేయాలని టీపీడీపీఎంఏ ఎగ్జిక్యూటివ్ సభ్యుడు బోయి సాయులు కోరారు. మండలంలోని కల్లూరు వాసవి డిగ్రీ కళాశాలను బుధవారం మూసి వేసి నిరసన తెలుపుతూ నినాదాలు చేశారు. ప్రిన్సిపల్ గట్టుపల్లి శ్రీనివాస్, అధ్యాపకులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల భవనానికి వీడీసీ మరమ్మతులు

లోకేశ్వరం, న్యూస్‌టుడే: మండలంలోని మన్మద్ ఉన్నత పాఠశాలలో సరిపడ తరగతి గదులు లేవని, గతంలో నిర్మించిన భవనానికి మరమ్మతులు చేపడితే కొరత తీరుతుందని ఉపాధ్యాయులు గ్రామాభివృద్ధి కమిటీ దృష్టికి తీసుకురాగా వారు వెంటనే స్పందించారు. దాదాపు రూ.30 వేలు వెచ్చించి మరమ్మతులు చేయించడంతో పాటు విద్యార్థినుల కోసం రూ.6 వేలతో కుట్టుమిషన్ కొనుగోలు చేసి పాఠశాలకు అందజేశారు. ఉపాధ్యాయుల పనితీరును చూసిన గ్రామస్థులు సైతం చేయూత అందించేందుకు ముందుకొచ్చారు. గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు రాజారాం రూ.13 వేలతో సిమెంటు బల్లలు తయారు చేయించి ఇచ్చారు. మరమ్మతులు చేసిన భవనం గోడలకు గంగాకిషన్ బొమ్మలు వేయించి సూక్తులు రాయించారు. జెట్ల నారాయణ పదో తరగతి విద్యార్థులకు పరీక్షలకు అవసరమైన సామగ్రి అందజేశారు. లైన్‌మెన్ గంగాకిషన్ రూ.3500 విలువ గల గ్లాసులు అందజేశారు. బుధవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఉపాధ్యాయులు గ్రామాభివృద్ధి కమిటీని సన్మానించారు. ప్రధానోపాధ్యాయులు మల్కాగౌడ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'హామీల అమలును ప్రశ్నిస్తే కేసులు పెడుతున్నారు'



మాట్లాడుతున్న భారాస నేత జాన్సన్‌నాయక్

ఖానాపూర్, న్యూస్‌టుడే: కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రశ్నిస్తున్న భారాస నేతలపై కేసులు నమోదు చేయడం సరికాదని భారాస నియోజకవర్గ ఇన్‌ఛార్జి భూక్య జాన్సన్‌నాయక్ అన్నారు. పట్టణంలోని ఆయన నివాసంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. ఉట్నూరు రాణాలో భారాస వర్కింగ్ ప్రెసిడెంట్‌పై కేసు నమోదు చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. ఆదిలాబాద్‌లో ఎమ్మెల్యే జోగు రామన్న సీఎం రేవంత్‌రెడ్డిపై ఫిర్యాదు చేస్తే పోలీసులు ఎందుకు కేసు నమోదు చేయలేదని ప్రశ్నించారు. ఉద్యమ పార్టీ భారాస నేతలు కేసులకు భయపడేది లేదని పేర్కొన్నారు. భారాస మండల, పట్టణ నాయకులు రాజగంగన్న, వాల్‌సింగ్, ప్రదీప్, సుమిత్, శ్రవణ్, సుమన్, సంతోష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ ప్రవేశాల గడువు పెంపు

కుంటాల, న్యూస్‌టుడే: ప్రభుత్వం జూనియర్ కళాశాలల్లో మొదటి సంవత్సరం ప్రవేశాలకు గడువు పొడిగించారని కుంటాల కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ తుకారాం తెలిపారు. ఆసక్తిగల విద్యార్థులు ఈ నెల 20వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

పశువులకు టీకాలు వేయించండి

సారంగాపూర్: గేదెలు, పశువులు, జీవాలకు టీకాలు వేయించాలని జిల్లా పశు వైద్యాధికారి బాలిక్ అహ్మద్ అన్నారు. బుధవారం మండలంలోని జౌళి, చించోలి(ఎం), గొడిసెర గ్రామాల్లో ఆయన పర్యటించారు. గాలికుంటు టీకాలు వేసే కార్యక్రమాన్ని పరిశీలించారు. ఆయన వెంట పశు వైద్యుడు నందకుమార్, సిబ్బంది సాగర్, పోతన్న, భోజన్న తదితరులు ఉన్నారు.

దస్తూరాబాద్ : పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు తప్పనిసరి వేయించాలని పశువైద్య సహాయకులు దేవిదాస్ కోరారు. బుధవారం మండలంలోని ఆకొండపేట గ్రామంలో టీకాలు వేశారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మల్లేష్, గ్రామస్థులు పాల్గొన్నారు.

శత శాతం పన్ను వసూళ్లు చేపట్టాలి

ఖానాపూర్: గ్రామాల్లో నీటి పన్ను నూరు శాతం వసూలు చేయాలని మండల ప్రత్యేకాధికారి జీవారత్నం అన్నారు. పట్టణంలోని ఎంపీడీవో సమావేశహాలులో బుధవారం ఎంపీడీవో సునీత, ఎంపీవో రత్నాకర్‌రావు, పంచాయతీ కార్యదర్శులు, ఏపీవో, టీఏలు, ఎఫ్ఏలతో సమావేశం నిర్వహించారు. డ్రైడే, ఇంటిపన్నులు, ట్రేడ్ లైసెన్స్, చెత్తా చెదారం తదితరాలపై సూచనలు చేశారు. గ్రామీణ ఉపాధిహామీ పనులపై చర్చించారు.

తపాలా బీమాతో ధీమా

కడెం: తపాలా బ్యాంకు ద్వారా వినియోగదారులకు వివిధ రకాల సేవలను అందిస్తున్నట్లు నిర్మల్ జిల్లా మేనేజర్ కల్యాణ్ అన్నారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన పోస్టల్ పేమెంట్ బ్యాంక్ సువిధ కేంద్రాన్ని బుధవారం ఆయన సందర్శించారు. రూ.755 చెల్లిస్తే రూ.15 లక్షలు, రూ.520 కడితే రూ.10 లక్షలు, రూ.2850 చెల్లిస్తే రూ. 50లక్షల బీమా వర్తిస్తుందని ఆయన చెప్పారు. ప్రతి వ్యక్తి ఖాతా తీసుకొని బీమా చేయించుకోవాలని ఆయన సూచించారు.

ఉత్సవాలను జయప్రదం చేయండి

కడెం: ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆవరణలో ఈ నెల 24న నిర్వహించనున్న పీడీఎస్‌యూ అర్ధశతాబ్ది ఉత్సవాలను జయప్రదం చేయాలని నిర్మల్ జిల్లా అధ్యక్షుడు సునారికర్ రాజేశ్ అన్నారు. మండల కేంద్రంలోని జూనియర్ కళాశాల ఆవరణలో ఉత్సవాల గోడప్రతులను బుధవారం విడుదల చేశారు.

సంక్షిప్త సమాచారం

20న విలీన సభ

లక్ష్మణచాంద: హైదరాబాద్‌లో ఈనెల 20న నిర్వహించే ఐఎఫ్‌టీయూ విలీన సభకు కార్మికులు పెద్ద ఎత్తున తరలిరావాలని ఐఎఫ్‌టీయూ జిల్లా సహాయ కార్యదర్శి గంగన్న కోరారు. లక్ష్మణచాందలో బుధవారం ప్రచార ప్రతులను విడుదల చేశారు.

మొరం టిప్పరు పట్టివేత

ముథోల్: ముథోల్‌లో అనుమతి లేకుండా మొరం తరలిస్తున్న టిప్పరును బుధవారం ముథోల్ పోలీసులు పట్టుకొని స్టేషన్‌కు తరలించారు. తదుపరి చర్యల కోసం తహసీల్దార్‌కు అప్పగిస్తున్నట్లు తెలిపారు.

గ్రామసభ

కుంటాల: మండలంలోని ఓలాలో బుధవారం ఉపాధిహామీ పథకం పనుల ఎంపిక కోసం గ్రామసభ నిర్వహించారు. పలు పనులను ఎంపిక చేసి తీర్మానించారు. ఏపీఓ గట్టుపల్లి నవీన్, ఇన్‌ఛార్జి కార్యదర్శి సతీష్, టీఏ కార్తిక్, ఎఫ్ఏ వాణి, కారోబరి కూస శంకర్, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

కుంటాల: మిషన్ భగీరథ నీటి సరఫరా తీరుపై గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. నిత్యం సరఫరాలో తీవ్ర జాప్యం జరుగుతుండటంతో తమకు ఇబ్బందులకు ఎదురవుతున్నాయని వాపోయారు. దీనిపై ఎమ్మెల్యే రామారావు పటేల్, అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ దృష్టికి తీసుకెళ్తామని గ్రామస్థులు పేర్కొన్నారు.

ఎమ్మెల్యే చిత్రపటానికి క్షీరాభిషేకం

కుంటాల: కుంటాల మండలం అంబకంటి నుంచి నర్సాపూర్(జి) మండలంలోని జాతీయ రహదారి 61 నందన్ ఎక్స్ రోడ్డు వరకు రహదారి అభివృద్ధికి రూ. 2 కోట్లు మంజూరయ్యాయి. నిధుల మంజూరుకు కృషి చేసిన ఎమ్మెల్యే రామారావు పటేల్ చిత్రపటానికి అంబకంటి గ్రామస్థులు బుధవారం క్షీరాభిషేకం చేశారు. నాయకులు వెంగళ్‌రావు, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

భైంసా గ్రామీణం: పేండ్‌పెల్లి-వానల్‌పాడ్ రహదారి అభివృద్ధికి ఎమ్మెల్యే నిధులు మంజూరు చేయించడంపై గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తూ బుధవారం పేండ్‌పల్లిలో ఎమ్మెల్యే చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. మాజీ ఎంపీపీ అబ్దుల్ రజాక్, నాయకులు సోలంకి భీంరావు, శ్రీనివాస్, పండిత్‌రావు, సచిన్, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం

కడెం: మండల కేంద్రంలోని ఉర్దూ పాఠశాల నుంచి బదిలీపై ఖానాపూర్ వెళుతున్న ఉపాధ్యాయుడు ఎం.రాణాను బుధవారం సన్మానించారు. అలాగే నూతనంగా పాఠశాలకు వచ్చిన ఉపాధ్యాయులు మాలిహామత్రీన్, ఆయేషా, మహావిష్ను సత్కరించారు. వాజిద్‌ఖాన్, జావీద్, ఫరీద్, శర్ఫోద్దిన్, అజ్మత్ తదితరులు పాల్గొన్నారు.

లైన్‌మెన్‌కు వీడ్కోలు

నిర్మల్ గ్రామీణం: మండలంలోని నీలాయిపేట్ లైన్‌మెన్‌గా పనిచేసి బదిలీపై వెళుతున్న రమేష్‌ను బుధవారంగ్రామస్థులు సన్మానించి వీడ్కోలు పలికారు.

కుభీరు యువతికి నాట్య మయూరి పురస్కారం



ధరణిశ్రీతో కుటుంబసభ్యులు, సొసైటీ ప్రతినిధులు

కుభీరు: దసరా, నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని హైదరాబాదులోని రవీంద్ర భారతిలో నృత్యమాల కళ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో సాంస్కృతిక పోటీలను నిర్వహించారు. ఈ పోటీలో పాల్గొన్న కుభీరుకు చెందిన సాప ధరణిశ్రీ భరతనాట్యంలో అబ్బురపరిచే ప్రదర్శన ఇచ్చారు. దీంతో పోటీల నిర్వాహకులు ఆమెకు నాట్యమయూరి పురస్కారం అందజేశారు.



కలెక్టరేట్‌కు ర్యాలీగా వస్తున్న నాయకులు, గ్రామస్థులు

గుండెగాం గ్రామస్థులను ఆదుకోవాలి

నిర్మల్ అర్బన్: భైంసా మండలం గుండెగాం గ్రామస్థులను ప్రభుత్వం, అధికారులు ఆదుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్.విలాస్ అన్నారు. బుధవారం సీపీఐ, తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్‌కు ర్యాలీగా వచ్చారు. కార్యాలయంలో అదనపు పాలనాధికారి కిషోర్‌కుమార్‌కు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. వెంటనే పునరావాసం కల్పించాలని, ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలన్నారు. నష్టపరిహారం చెల్లించి ప్రభుత్వ పథకాల ద్వారా రుణాల అందజేత, విద్యావంతులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరారు. రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ అమలు, తదితర వాటిని నెరవేర్చాలని పేర్కొన్నారు. నాయకులు ఎస్.చంద్రకాంత్, భుక్య రమేశ్, కె.భూమయ్య, సి.దేవిదాస్, ఎస్.ఎన్.రెడ్డి, ఎల్.ఆర్.ఉపాలి, టి.మల్కయ్య, రాష్ట్రపాల్, లక్ష్మణ్, గ్రామస్థులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంపై అవగాహన

కడెం: మండలంలోని మాసాయిపేట, నర్సాపూర్ అంగన్‌వాడీ కేంద్రాల్లో బుధవారం ఐదేళ్ల లోపు చిన్నారులకు అందించే పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. ఎస్ఏఎం, ఎంఏఎం క్యాంపులు నిర్వహించి 62 మంది పిల్లలకు వివిధ పరీక్షలు చేశారు. డా.శివకుమార్, డా.నాగరాజు, వేణుగోపాల్, రేణుక, భూమయ్య, నిహారిక, కృష్ణవేణి, అంగన్వాడీ పర్యవేక్షకురాలు ప్రేమలత, అంగన్వాడీ టీచర్లు గంగవ్వ, పుష్పలత, భూపేందర్‌కౌర్ తదితరులు పాల్గొన్నారు.

సమతుల ఆహారంతో చక్కటి ఆరోగ్యం

సారంగాపూర్: పిల్లలు, పెద్దలు సమతుల ఆహారాన్ని తీసుకుంటే చక్కటి ఆరోగ్యాన్ని పొందుతారని సారంగాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు వేదవ్యాస్ అన్నారు. బుధవారం మండలంలోని జామ్, ధని గ్రామాల్లో సీడీపీవో నాగమణితో కలిసి ఆయన పర్యటించారు. స్థానిక అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించారు. కేంద్రాల్లోని చిన్నారులు ఎత్తుకు తగిన బరువు ఉన్నారా లేదా అని చూశారు. ఆహార అలవాట్లపై అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయగౌరి, ఆరోగ్య పర్యవేక్షకులు కృష్ణమోహన్‌గౌడ్, శ్రీనివాస్, శాలిని, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఈ సందర్భం ఓ మధుర జ్ఞాపకం..!!

● కొలువులో చేరిన కొత్త ఉపాధ్యాయులు

మామడ, న్యూస్‌టుడే: ఈ రోజుల్లో ప్రభుత్వ ఉద్యోగం సాధించాలంటే మాటలు కాదు. తీవ్రమైన పోటీలో తమ ప్రతిభతో వేలాది మంది కన్నా ముందు నిలిస్తేనే కోరుకున్న కొలువు సొంతమవుతుంది. అందులోనూ గౌరవప్రదమైన ఉపాధ్యాయ వృత్తిలో చేరే అవకాశం వస్తే అంతకన్నా ఆనందం ఇంకేముంటుంది. ఇటీవల విడుదలైన డీఎస్సీ ఫలితాల్లో గురువులుగా ఎంపికైన వారు బుధవారం విధుల్లో చేరారు. టీచర్లుగా తొలిరోజు వారికి జీవితంలో ఎప్పటికీ గుర్తుండి పోయే మధుర జ్ఞాపకం. నూతనంగా బాధ్యతల్లో చేరిన పలువురు తమ అనుభూతులను ఇలా పంచుకున్నారు..


మామడ పాఠశాలలో సురేష్ పవార్‌కు స్వాగతం పలుకుతున్న విద్యార్థులు, సహచర ఉపాధ్యాయులు

ఈ స్వాగతం చిరస్మరణీయం..

ఎవరికైనా బడితో అనుబంధం ఎంతో మధురంగా ఉంటుంది. అందుకే ఉన్నత స్థానాలకు చేరుకున్నా తాము చదువుకున్న పాఠశాలకు వీలైనప్పుడల్లా వెళ్తుంటారు. ఉపాధ్యాయులుగా ఎంపికైన వారికి నిత్యం మళ్లీ విద్యార్థి దశ గుర్తొస్తుందన్న అభిప్రాయాన్ని మామడ జడ్పీఉన్నత పాఠశాలలో హిందీ ఉపాధ్యాయుడిగా విధుల్లో చేరిన కుంటాల మండలం అంబుగామ్‌కు చెందిన సురేష్ పవార్ వ్యక్తం చేశారు. మొదటి రోజు బడికి వచ్చిన నాకు తోటి ఉపాధ్యాయులు చెప్పిన స్వాగతం, ప్రభుత్వ కొలువు సాధించి హాజరు రిజిస్టర్లో చేసిన సంతకం అంతా ఓ కొత్త అనుభూతినిచ్చిందని సురేష్ సంబరపడ్డారు.

ఉన్న ఊరులోనే ఉపాధ్యాయురాలిగా..


పొన్కల్ పాఠశాలలో పిల్లలతో మౌనిక

దస్తురాబాద్ మండలం మున్యాల్‌కు చెందిన మౌనిక మామడ మండలం పొన్కల్‌కు చెందిన హరీష్‌ను వివాహం చేసుకున్నారు. డీఎస్సీలో ఎస్జీటీగా ఎంపికైన ఆమెకు మెట్టినిల్లైన పొన్కల్‌లోనే ఉపాధ్యాయురాలిగా పనిచేసే అవకాశం వచ్చింది. తొలి రోజు విధుల్లో చేరిన నాకు పిల్లలకు పాఠాలు చెప్పడం, సహచర ఉపాధ్యాయులను కలవడం కొత్త అనుభూతినిచ్చిందన్నారు. ఉపాధ్యాయురాలిగా విద్యార్థులకు చక్కగా చదువు చెప్పి మంచి పేరు తెచ్చుకుంటానని ఆనందం వ్యక్తం చేశారు.

అమ్మానాన్నల దగ్గరే ఉండి మళ్లీ బడికి..


విధుల్లో చేరే ముందు తల్లిదండ్రుల ఆశీర్వాదం తీసుకుంటున్న దివ్యరాణి

జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం కేశాపూర్‌కు చెందిన లక్ష్మీ-గంగాధర్ దంపతుల కుమార్తె దివ్యరాణి. ఈమెకు నిర్మల్ మండలం నీలాయిపేటకు చెందిన మురళితో వివాహమైంది. అప్పటి నుంచి ఆ గ్రామంలోనే ఉంటున్నారు. ఇటీవల ఉపాధ్యాయురాలిగా ఎంపికైన దివ్యరాణికి సొంత జిల్లా జగిత్యాలలో పోస్టింగ్ వచ్చింది. సహజంగా చిన్నప్పుడు అమ్మానాన్నల దగ్గరుండి పిల్లలు బడికెళ్తుంటారు. ఇప్పుడు మళ్లీ తల్లిదండ్రుల దగ్గరుండి పాఠశాలకు వెళ్లే అవకాశం రావడం అదృష్టమని అభిప్రాయపడ్డారు. సొంతూరు కేశాపూర్‌కు సమీపంలోనే ఎర్దండి ప్రాథమిక పాఠశాలలో ఆమె విధుల్లో చేరారు. గురువుగా అంకిత భావంతో పని చేస్తానని, పిల్లలను ప్రతిభావంతులుగా తీర్చిదిద్దేందుకు కృషిచేస్తానన్నారు. ఒక ఉపాధ్యాయురాలిగా తొలిరోజు ఎప్పటికీ గుర్తుండిపోతుందన్నారు.

మొన్నటి దాకా నిరుద్యోగులు..

జీవితంలో ఎత్తుపల్లాలు సహజం. ఉద్యోగం లేక చిన్నాచితక పనులు చేసుకుంటూ నిరుద్యోగులుగా ఎన్నో కష్టాలు పడ్డ వారు ఉద్యోగులుగా మారిన క్షణాన్ని ఎలా మరిచి పోగలరు. ఓ కొత్త జీవితానికి నాంది పలికిన సందర్భం ఎంతో ప్రత్యేకంగా నిలుస్తుంది. ప్రణాళిక, పట్టుదల, క్రమశిక్షణతో అడుగులు వేసే వారికి ఆలస్యంగానైనా మంచి ఫలితాలు వస్తాయని యువత తమ ప్రతిభతో నిరూపిస్తున్నారు.

నేనే మీ ఊరి కొత్త టీచర్‌ను..

నిర్మల్‌కు చెందిన అభిలాష్ ఇన్నాళ్లూ మామడ మండలంలో పంచాయతీ కార్యదర్శిగా పనిచేశారు. తాజాగా ఉపాధ్యాయునిగా ఎంపికైన ఆయనకు పెంబి మండలం అంకెన గ్రామపంచాయతీ పరిధిలోని బూరుగుపల్లి ప్రాథమిక పాఠశాలను కేటాయించారు. మొదటి రోజు ఆ ఊరికి వెళ్లిన అభిలాష్ గ్రామస్థులను కలిశారు. పిల్లలను క్రమం తప్పకుండా బడికి పంపించాలని తల్లిదండ్రులకు సూచించారు. పంచాయతీ కార్యదర్శిగా పనిచేసిన అనుభవంతో పాఠశాలను చక్కగా తీర్చిదిద్దుతానన్నారు. సమాజంలో గౌరవప్రదమైన ఉపాధ్యాయ వృత్తిలో చేరడం అదృష్టంగా భావిస్తున్నానని అభిప్రాయపడ్డారు. జీవితంలో ఇది గుర్తుండి పోయే రోజని ఆనందం వ్యక్తం చేశారు.


గ్రామస్థులతో మాట్లాడుతున్న అభిలాష్

ప్రతిభావంతులుగా తీర్చిదిద్దుతా..


ఝరి పాఠశాలలో తొలిరోజు విద్యార్థులకు పాఠం చెబుతున్న మోహన్

మామడ మండలం గోండుగూడకు చెందిన మోహన్ తానూరు మండలం ఝరి తండా పాఠశాలలో బాధ్యతలు తీసుకున్నారు. సొంతూరులో మొదటి ప్రభుత్వ ఉద్యోగిగా ఆయన ప్రత్యేక గుర్తింపు పొందారు. మారుమూల తండా పాఠశాలలో పనిచేసే అవకాశం వచ్చిందని, బాధ్యతలు చక్కగా నిర్వర్తించి అక్కడి పిల్లలను ప్రతిభావంతులుగా తీర్చిదిద్దుతానన్నారు. ఇన్నాళ్లూ నిరుద్యోగిగా ఎంతో కష్టపడ్డాను..ఇప్పుడు ఉపాధ్యాయునిగా ఇష్టంగా పని చేసి మంచి పేరు తెచ్చుకుంటానని చెప్పారు. కొత్తగా విధుల్లో చేరిన సందర్భంలో ఆనందబాష్పాలు వచ్చాయని ఈ రోజు ఎంతో ప్రత్యేకంగా నిలిచి పోతుందన్నారు.

హత్య కేసులో 16 మందికి జీవిత ఖైదు, జరిమానా

రెబ్బెన, న్యూస్‌టుడే: కుమురంభీం జిల్లా రెబ్బెన మండలం సింగిల్‌గూడ గ్రామానికి చెందిన ఆజ్మీర రమేష్ హత్యకు కారణమైన 16 మందికి జీవిత ఖైదు, రూ.1,49,000 జరిమానా విధిస్తూ ఆసిఫాబాద్ సెషన్స్ కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎంవీ రమేష్ బుధవారం తీర్పునిచ్చినట్లు ఎస్పీ డి.వి శ్రీనివాసరావు తెలిపారు. ఎస్పీ వివరాల ప్రకారం.. 2020 ఆగస్టు 19న రమేష్ సోదరి రాజేశ్వరి తన ఇంటికి వస్తుండగా మార్గమధ్యలో అదే గ్రామానికి చెందిన జర్పుల సురేష్ ఆమెతో అసభ్యంగా ప్రవర్తించాడు. ఆమె కేకలు వేయడంతో సోదరుడు రమేష్, ఆయన కుమారుడు లోకేష్ ఇంటి నుంచి బయటకు రావడంతో సదరు వ్యక్తి పారిపోయాడు. అనంతరం రమేష్ ఇతర పనులకు బయటకు వెళ్లి ఇంటికి తిరిగి వస్తున్న క్రమంలో.. విషయాన్ని మనసులో పెట్టుకున్న సురేష్ 15 మందితో కలిసి వెంట తెచ్చుకున్న గొడ్డలితో రమేష్‌ను తలపై నరికారు. మిగిలిన వారు రాజేశ్వరి, భార్య రేణుకలపై కర్రలతో దాడి చేశారు. తీవ్రంగా గాయపడ్డ రమేష్ మంచిర్యాల ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందారు. ఈ ఘటనపై అప్పటి రెబ్బెన ఎస్సై డి.రమేష్ మొదటి ఇన్వెస్టిగేషన్ అధికారిగా నియామకమయ్యారు. జర్పుల సురేష్, జర్పుల సత్యవతి, ఆజ్మీర వసంత్ రావు, జర్పుల తిక్యానాయక్, జర్పుల హరీశ్, ఆజ్మీర అరవింద్, ఆజ్మీర నవీన్, ఆజ్మీర ప్రవీణ్, ఆజ్మీర సంతోష్, ప్రవీణ్‌కుమార్, జర్పుల లక్ష్మి, జర్పుల రజిత, జర్పుల తుకారం, జర్పుల రవి, జర్పుల రాజు, జర్పుల బిక్యానాయక్‌లపై మృతుడి భార్య రేణుక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించి కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేశారు. ఆసిఫాబాద్ లైజనింగ్ అధికారి (ఏఎస్సై) రామ్‌సింగ్ ఆధ్వర్యంలో కోర్టు కానిస్టేబుల్ ఉమేశ్వర్ కోర్టులో 16 మంది నిందితులను ప్రవేశ పెట్టారు. ప్రాసిక్యూషన్ తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ జగన్‌మోహన్‌రావు వాదించారు. న్యాయమూర్తి జి.వి రమేష్ శిక్ష విధించినట్లు ఎస్పీ వివరించారు.

ఆరేళ్ల బాలికపై అత్యాచారం కేసులో 20 ఏళ్ల జైలు శిక్ష

ఎదులాపురం, న్యూస్‌టుడే : ఆరేళ్ల బాలికపై అత్యాచారం కేసులో ఆదిలాబాద్‌కు చెందిన జమీల్‌ఖాన్(25)కు 20 సంవత్సరాల జైలు శిక్ష, రూ.7 వేల జరిమానా విధిస్తూ ఆదిలాబాద్ పోక్సో కోర్టు బుధవారం తీర్పును వెలువరించింది. లైజన్ అధికారి జి.పండరి వివరాల మేరకు.. పట్టణంలోని ఒక కాలనీకి చెందిన బాలికకు, ఆమె తమ్ముడికి చదువు చెప్పే జమీల్‌ఖాన్ తన ఇంట్లో శుభకార్యం ఉందని చెప్పి 2021 ఫిబ్రవరి 14న సాయంత్రం 5.30కు బాలికను, ఆమె తమ్ముడి(4)ని ఇంటికి తీసుకెళ్లాడు. తిరిగి ద్విచక్ర వాహనంపై వారిని దిగబెట్టడానికి బయలుదేరి మధ్యలో వాహనాన్ని ఆపి బాధితురాలి తమ్ముడికి చరవాణి ఇచ్చి బాలికను పొదల్లోకి తీసుకెళ్లి అత్యాచారం చేశాడు. తరువాత వారిని ఇంటి వద్ద దింపగా బాలిక ఏడుస్తూ విషయాన్ని తల్లికి చెప్పింది. వారు వన్‌టౌన్‌లో ఫిర్యాదు చేయగా అప్పటి సీఐ రామకృష్ణ కేసును నమోదు చేశారు. ఈ కేసులో కోర్టు విధుల పోలీసు అధికారి ఠాకూర్ రవీందర్‌సింగ్ ప్రవేశపెట్టిన 14 మంది సాక్షులను ప్రత్యేక పీపీ విచారించి నేరాన్ని రుజువు చేశారు. పోక్సో కోర్టు న్యాయమూర్తి పి.శివరాంప్రసాద్ పైమేరకు తీర్పునిచ్చారు.

దివ్యాంగుడిపై లైంగిక దాడి

ఇచ్చోడ, న్యూస్‌టుడే : దివ్యాంగుడిపై యువకుడు లైంగిక దాడికి పాల్పడిన ఘటన ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలంలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. ఓ గ్రామానికి చెందిన యువకుడు(20) ఈ నెల 13న రాత్రి సమయంలో అదే గ్రామానికి చెందిన దివ్యాంగుడిని(32) పక్కనే ఉన్న పంట పొలానికి తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాధితుడికి రక్తస్రావం కావడంతో గమనించి కుటుంబ సభ్యులు ఆరా తీశారు. విషయం తెలియడంతో మంగళవారం బాధిత కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బాసరలో గంగాహారతి


గోదావరినదికి హారతి ఇస్తున్న అర్చకులు


ముథోల్(బాసర): దేవాదాయ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు బుధవారం బాసర గోదావరి నది వద్ద గంగాహారతి నిర్వహించారు. ఈ సందర్భంగా వేదపండితులు ప్రత్యేకపూజలు చేసిన అనంతరం గోదావరి నదికి హారతి ఇచ్చారు. బాసర గ్రామస్థులతో పాటు భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో గోదావరి నది వద్ద భక్తుల సందడి కనిపించింది. కార్యక్రమంలో ఆలయ ఇన్‌ఛార్జి ఈఓ విజయరామారావు, వేదపండితులు పాల్గొన్నారు.

ఆత్మగౌరవానికి ప్రతీక.. కుమురం భీం

● నేడు జోడేఘాట్‌లో వర్ధంతి

ఈనాడు, ఆసిఫాబాద్, న్యూస్‌టుడే, కెరమెరి

అడవుల జిల్లా ఉమ్మడి ఆదిలాబాద్‌లో పుట్టి ఆదివాసీల ఆత్మగౌరవానికి ప్రతీక అయిన కుమురం భీం.. జీవితం, పోరాటం అడుగడుగునా వీరోచితం. వనాలతో మమేకమైన బతుకులతో ఆటలాడుతున్న నిజాం సైన్యానికి నూనుగు మీసాల వయసులోనే వెన్నులో వణుకు పుట్టించిన గోండు బెబ్బులి. గెరిల్లా పోరాటాల్లో తోటి వారికి తర్ఫీదునిచ్చి గ్రామాలను ఒక్కటిగా చేసి నిజాం గుండెల్లో రైళ్లు పరుగెత్తించిన వీరుడు. నమ్మక ద్రోహ చర్యలో అసువులు బాసిన ఆయనను మరోసారి స్మరించుకునేందుకు ప్రజలందరి అడుగులు గురువారం (17న) జోడేఘాట్ వైపే సాగనున్నాయి.



తుపాకీ శిక్షణ కోసం

అధికారి మరణంతో ఆదివాసీలపై అధికారుల నిర్బంధం ఎక్కువయ్యాయి. చదువు లేక పోవడంతో జరిగే అనర్థాలు తెలుసుకున్న భీం.. ఈక్రమంలో జల్, జంగల్, జమీన్ లక్ష్య సాధనలో చదువుతో పాటు తుపాకీ పేల్చడం నేర్చుకోవాలని నిర్ణయించుకున్నారు. 1935లో కోవ అర్జు, మడావి కొద్దు, కుమ్ర లచ్చులతో కలిసి అసోం ప్రాంతానికి వెళ్లారు. తుపాకీ వాడకం నేర్చుకుని మూడేళ్ల తర్వాత తిరిగి సొంత ప్రాంతానికి వచ్చారు.

తుడుం మోగించి.. ఒక్కటి చేసి


జోడేఘాట్‌కు వెళ్లే దారి

సాగు భూములపై హక్కులతో పాటు, పన్నుల రద్దు గురించి భీం 1938 నుంచి పోరాటం ఉద్ధృతం చేశారు. నిజాం తాలుకాదార్ అబ్దుల్ సత్తార్ (అప్పటి కలెక్టర్)తో నిర్వహించిన చర్చలు విఫలం కావడంతో.. ఉద్యమం క్రమంగా సాయుధ పోరాటంగా మారింది. ఈక్రమంలో కెరమెరి మండలంలోని టోకెన్ మోవాడ్, లైన్‌పటార్, బాబేఝరి, శివగూడ, పిట్టగూడ, కల్లెగాం, పట్నాపూర్, చాల్‌బడి, పాటగూడ, చిన్న పట్నాపూర్, గోండుగూడ, కొపగూడ గ్రామాల్లోని ప్రజలందరినీ ఏకం చేశారు. తుడుం మోగించి జోడేఘాట్ వద్ద సమావేశపర్చేవారు. వీరి సహకారంతో పోరు సాగుతున్న తరుణంలో ఆయనను ఎలాగైనా అణచివేయాలని నిజాం పోలీసులను రంగంలో దించారు. కుర్దు పటేల్ అనే నమ్మక ద్రోహి ఇచ్చిన సమాచారంతో భీం ఉన్న స్థలాన్ని పసిగట్టి కాల్పులు జరపగా.. 1940న తుదిశ్వాస విడిచారు.

పోరాటం వైపు పయనం..



ప్రస్తుత కుమురంభీం జిల్లా ఆసిఫాబాద్ మండలం పాత రౌటసంకెపల్లిలో 1900 అక్టోబరు 22న మైనుబాయి-చిన్ను దంపతులకు కుమురం భీం జన్మించారు. చిరుప్రాయంలోనే తండ్రి చనిపోవడంతో కుటుంబం సుర్దాపూర్ ప్రాంతానికి వలస వెళ్లింది. అటవీ పుత్రులైన గిరిజనులపై ఆ సమయంలో నిజాం ప్రభువు రకరకాల పన్నులు వసూలు చేసేవారు. దీనిపై వారిలో అసహనం వ్యక్తమైనా ఎవరై ధైర్యం చేయలేని పరిస్థితులు. భీం సాగు చేసిన పంట చేతికొచ్చిన తరుణంలో పంటను కాజేయడానికి అటవీ అధికారి సిద్ధిక్ రాగా.. వారిద్దరి మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. అధికారిని కర్రతో కొట్టి చంపిన భీంకు 15 ఏళ్లు ఉండటం గమనార్హం. ఇదే ఆయన పోరాటానికి ఆరంభం.


మ్యూజియం

గిరిజన ప్రగతికి సంస్కరణలు..

భీం ప్రాణత్యాగంతో కళ్లు తెరిచిన నిజాం ఆదివాసీల అభ్యున్నతి కోసం సంస్కరణలు చేపట్టారు. ప్రఖ్యాత మానవ పరిణామ శాస్త్రవేత్త హైమన్ డార్ఫ్‌ను నియమించింది. గిరిజనులతో ఆయన మమేకమై వారి స్థితిగతులపై అధ్యయనం చేసి, అభివృద్ధికి మార్గనిర్దేశనం చేశారు. ఆయన సూచనలతోనే అటవీ భూమిని రెవెన్యూ భూమిగా మార్చుతూ ఉత్తర్వులు వచ్చాయి.

- జైనూర్ మండలం దబోలిలో 40వేల అటవీ భూముల పంపిణీ
- ఉమ్మడి జిల్లాలో 1.60 లక్షల ఎకరాలు గిరిజనులకు పంపిణీ
- గిరిజనుల భూ బదలాయింపు నిషేధిత చట్టం, గిరిజన ప్రాంతాల రెగ్యులరైజేషన్‌కు రూపకల్పన
- తిర్యాణి మండలంలో గిన్నెధరి, మర్లవాయిలో ఉపాధ్యాయ శిక్షణ కేంద్రాల ఏర్పాటు
- ఆదివాసీ ప్రాంతాల్లో 30 నూతన పాఠశాలల ఏర్పాటు
- గిరిజన తెగలు, గిరిజన ప్రాంతాలను నోటిఫైడ్‌గా ప్రకటన
- ఐటీడీఏలు, గిరిజన సహకార సంఘాల ఏర్పాటు


స్మృతివనం

ఏఈవోలకు తాఖీదులు


ఆదిలాబాద్ వ్యవసాయం, న్యూస్‌టుడే : జిల్లాలోని వ్యవసాయ విస్తరణ అధికారుల (ఏఈవో)పై ఉన్నతాధికారులు చర్యలకు ఉపక్రమించారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు డిజిటల్ సర్వే చేయాల్సిన ఏఈవోలు తమకు పని భారం అవుతుందని సర్వేకు దూరంగా ఉన్నారు. ఆగ్రహించిన ఉన్నతాధికారులు ఉమ్మడి జిల్లా మొత్తం ఏఈవోలకు మెమోలు జారీ చేశారు. డిజిటల్ సర్వే అంటే పంట పొలానికి వెళ్లి సంబంధిత వ్యవసాయ సిబ్బంది ఫొటో తీసి వివరాలు నమోదు చేయాల్సి ఉంటుంది. ఇందుకు సెల్‌ఫోన్లలో యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించింది. ఇప్పటికే అనేక పనులతో తలమునకలై ఉన్నామని, ఈ పనికి సహాయకుడిగా మరో వ్యక్తిని నియమించాలని ఏఈవోలు కోరారు. ప్రభుత్వం ఒప్పుకోకపోగా.. డిజిటల్ సర్వేను పూర్తి చేయాలని తిరిగి ఆదేశించింది. అయినా సర్వే చేయడం కుదరదంటూ రాష్ట్ర వ్యాప్తంగా 15 రోజులుగా ఏఈవోలు సర్వేకు దూరంగా ఉన్నారు. సర్వే మినహా ఇతర పనులు పూర్తి చేస్తున్నా.. ప్రభుత్వ ఆదేశాలు పట్టించుకోకపోవడం, విధుల్లో నిర్లక్ష్యం చేశారంటూ.. అందరికి మెమోలు జారీ చేసింది.

పల్లెదారులకు రూ.15 కోట్లు మంజూరు

ఇంద్రవెల్లి, న్యూస్‌టుడే : రోడ్డు సౌకర్యం లేని గ్రామాలకు రహదారుల నిర్మాణానికి ప్రభుత్వం రూ.15.07 కోట్లు మంజూరు చేసింది. ఖానాపూర్ నియోజకవర్గంలోని జన్నారం, ఉట్నూరు, ఖానాపూర్ మండలాల పరిధిలోని మారుమూల గిరిజన గ్రామాలకు నిధులు విడుదల చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఉట్నూరు మండలంలోని చాపరాల నుంచి మత్తడిగూడ వరకు 5 కి.మీ.ల రోడ్డు నిర్మాణానికి రూ.5.15 కోట్లు, శంభుగూడ నుంచి సుహినూర్ వరకు 3 కి.మీ రహదారికి రూ.3.24 కోట్లు, జన్నారం నుంచి నర్సింగాపూర్ వరకు 3 కి.మీ రోడ్డుకు రూ.2.94 కోట్లు, పీడబ్ల్యూడీ రహదారి నుంచి నర్సింగాపూర్‌కు రూ.2.50 కోట్లు, ఇదే రహదారిపై కల్వర్టులకు రూ.54 లక్షలు, ఖానాపూర్ మస్కపూర్ వయా చర్చి రోడ్డుకు రూ.70 లక్షలు మంజూరయ్యాయని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు తెలిపారు.

సూర్యప్రతాపం

● ఉమ్మడి జిల్లాలో భిన్న వాతావరణం




ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో వాతావరణంలో మార్పులతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. నైరుతి రుతుపవనాల కాలం పూర్తి అయినప్పటికీ మరో నెల రోజులపాటు ఈశాన్య రుతుపవనాల ప్రభావం కారణంగా వర్షాలు కురిసే అవకాశం ఉంది. అడపాదడపా జిల్లావ్యాప్తంగా రాత్రి కొన్ని ప్రాంతాల్లో జల్లులు కురుస్తున్నా పగటి ఉష్ణోగ్రతలు మాత్రం 35 నుంచి 40 డిగ్రీల నడుమ కొనసాగుతుండటం గమనార్హం. దీంతో మధ్యాహ్నం పూట బయటకు వెళ్లాలంటే తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. జిల్లాలో విభిన్న వాతావరణ పరిస్థితులు ఆరోగ్యాల మీద ప్రభావాన్ని చూపుతున్నాయి. -న్యూస్‌టుడే, లక్షెట్టిపేట

మరో మూడు రోజులు ఇవే తిప్పలు

ఉదయం 9 గంటలు దాటిందంటే చాలు వేసవిని తలపిస్తూ భానుడు తన ప్రతాపాన్ని చూపుతున్నాడు. సాయంత్రం 4 గంటల వరకు ఎండల తీవ్రత ఎక్కువగా ఉంటోంది. దీనికి తోడు ఉక్కపోతతో జిల్లావాసులు సతమతం అవుతున్నారు. అల్పపీడన ప్రభావంతో రాష్ట్రంలో చాలా జిల్లాలో వర్షాలు కురుస్తున్నప్పటికీ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఎండల తీవ్రత కొనసాగనున్నట్లు వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. గడిచిన వారం రోజులుగా ఎండల తీవ్రత కొనసాగుతుండగా రానున్న మూడు రోజులపాటు కూడా జిల్లాలోని చాలా ప్రాంతాల్లో పగటి ఉష్ణోగ్రతలు 34 నుంచి 38 డిగ్రీల సెంటీగ్రేడ్‌ల మధ్య కొనసాగే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది.

స్వయం చాలక వాతావరణ కేంద్రాల్లో బుధవారం నమోదైన గరిష్ఠ, కనిష్ఠ ఉష్ణోగ్రతల వివరాలు ఇలా..



ఆరోగ్య సమస్యలు

అసాధారణ వాతావరణ పరిస్థితుల కారణంగా జిల్లావాసులు వివిధ రకాల ఆరోగ్య సమస్యల బారిన పడుతున్నారు. ఎండ తీవ్రత, ఉక్కబోత కారణంగా చర్మ సంబంధిత వ్యాధులు పీడిస్తున్నాయి. కొంత మంది ఒళ్లు, కండరాల నొప్పులతోపాటు గొంతు నొప్పి, శ్వాస సంబంధిత వ్యాధులతో బాధపడుతున్నారు.

14 రోజులు.. రూ.19.42 కోట్లు

● ఆర్టీసీకి దసరా, బతుకమ్మ పండగ సెలవుల్లో ఆదాయం


ఆర్టీసీ బస్సు ఎక్కుతున్న ప్రయాణికులు

ఆదిలాబాద్ అర్బన్, న్యూస్‌టుడే : దసరా, బతుకమ్మ పండగలు ఆర్టీసీకి కాసులు కురిపించాయి. విద్యాసంస్థలకు సెలవులు ప్రకటించడం, ఉద్యోగులు, వ్యాపారులు సొంతూళ్లకు బయల్దేరేందుకు ఆర్టీసీ బస్సులను ఆశ్రయించడంతో సంస్థకు భారీగా ఆదాయం సమకూరింది. రీజియన్‌లోని ఆరు డిపోల నుంచి హైదరాబాద్‌కు రెగ్యులర్‌గా నడిచే బస్సులతో పాటు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేయడం కలిసివచ్చింది. ఈనెల 1 నుంచి 14 తేదీ వరకు రూ.19.42 కోట్ల ఆదాయం సమకూరింది. 12, 13 తేదీలలో వరుసగా రూ.72.70 లక్షలు, రూ.89.55 లక్షలు మినహాయిస్తే రోజూ సగటున రూ.1.38 కోట్ల ఆదాయం వచ్చింది. గతేడాది దసరా సీజన్‌లో 12 రోజుల్లో రూ.11.81 కోట్ల ఆదాయం వచ్చింది.

ఈ నెల 1 నుంచి 14 వరకు వివరాలు

డిపో	మొత్తం ప్రయాణికులు	మహాలక్ష్ములు	ఆదాయం (రూ.కోట్లలో)
ఆదిలాబాద్	7,05,631	3,77,368	4.02
భైంసా	5,95,744	3,56,985	1.99
నిర్మల్	8,80,500	5,73,128	4.96
ఉట్నూరు	1,95,237	1,21,929	0.90
ఆసిఫాబాద్	5,68,995	3,85,795	2.85
మంచిర్యాల	8,27,740	5,02,679	4.68

61 శాతం మహిళా ప్రయాణికులే

ఆదిలాబాద్ రీజియన్ పరిధిలోని ఆదిలాబాద్, ఉట్నూరు, నిర్మల్, భైంసా, ఆసిఫాబాద్, మంచిర్యాల డిపోలున్నాయి. ప్రత్యేకంగా హైదరాబాదుకు 412 బస్సులను ఏర్పాటు చేశారు. రీజియన్ వ్యాప్తంగా బస్సులను ప్రతిరోజు సగటున 2.45 లక్షల కిలోమీటర్ల మేర నడిపారు. 14 రోజుల్లో మొత్తంగా 34.34 లక్షల కిలోమీటర్ల మేర బస్సులను నడిచాయి. మొత్తంగా 37.73 లక్షల మంది ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరవేశారు. అందులో ఛార్జీలు చెల్లించిన ప్రయాణికులు 14.55 లక్షల మంది కాగా మహాలక్ష్మి పథకం కింద ఉచితంగా ప్రయాణించిన మహిళలు 23.17 లక్షల మంది కావడం గమనార్హం.

తిరుగు ప్రయాణానికి ఏర్పాట్లు

- సోలోమన్, రీజినల్ మేనేజరు, ఆర్టీసీ

దసరా, బతుకమ్మ పండగలకు ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశాం. సెలవులు ముగిసినందున తిరుగు ప్రయాణానికి ఇబ్బందులు కలగకుండా అన్ని డిపోల నుంచి బస్సులను నడుపుతున్నాం.